నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 6 సెప్టెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

మల్టీపర్పస్ స్పోర్ట్స్ స్టేడియం ఏమాయె..?

అడుగు ముందుకు పడని రాయగిరి స్టేడియం నిర్మాణం

- గతేడాది 10ఎకరాల భూమి కేటాయిస్తూ ఉత్తర్వులు
- ఎనిమిది నెలలు దాటినా పట్టించుకోని వైనం
- ఇప్పటి వరకు స్టేడియం మంజూరే లేదు
- ఖేలో ఇండియా కింద నిధులు వస్తేనే పనులట..!
- అందుబాటులోకి వస్తే సకల హంగులు, ఆధునిక వసతులు
- ఇండోర్ స్టేడియం, అథ్లెటిక్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్ నిర్మాణం

మల్టీపర్పస్ స్టేడియం..
అథ్లెటిక్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్..

రాష్ట్ర రాజధాని సమీపంలో ఈ భారీ స్టేడియం నిర్మించనుండటంతో క్రీడాకారులకు ఎంతో ప్రయోజనం కలుగనుంది. ప్రాక్టీస్, టోర్నమెంట్లు, ట్రైనింగ్‌కు ఉపయోగపడనున్నాయి. ప్రాజెక్ట్‌లో భాగంగా తొలుత మూడు భారీ నిర్మాణాలు చేపట్టాలని భావించారు. అందులో రూ. 14 కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, రూ.8 కోట్లతో స్విమ్మింగ్ పూల్, రూ.9.5 కోట్లతో 400 మీటర్ల పొడవు గల ఎనిమిది లైన్లతో అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణాలు చేపట్టనున్నారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో షటిల్, బ్యాడ్మింటన్ కోర్టులు, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, జూడో కోర్టులు నిర్మించనున్నారు. ఇవన్నీ సకల హంగులు, అత్యాధునిక వసతులతో నిర్మించనున్నారు.


రాయగిరిలో నిర్మించనున్న స్టేడియం నమూనా

యాదాద్రి మల్టీపర్పస్ స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణం పత్తాలేదు. సకల హంగులు, అత్యాధునిక వసతులతో నిర్మిస్తామన్న స్టేడియం ఊసేలేదు. రాష్ట్ర ప్రభుత్వం భూ కేటాయింపులు చేసి చేతులు దులుపుకొన్నది. ఇప్పటి వరకు స్టేడియం మంజూరే కాలేదు. ఇది అందుబాటులోకి వస్తే క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడనుంది. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తేనే కదలిక వస్తుందని అధికారులు చెబుతున్నారు.

– యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ)

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో ఇండోర్ స్టేడియం నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రాయగిరిలో ముత్తిరెడ్డిగూడెం వెళ్లేదారిలో ఏర్పాటు చేయాలని భావించింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. దీనికి సర్కారు ఆమోద ముద్ర వేసింది. రాయగిరిలోని సర్వే నంబర్ 259లో పదెకరాల భూమిని కేటాయించింది. ఈ మేరకు గతేడాది డిసెంబర్ 18న రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ జీవో నంబర్ 165 విడుదల చేశారు. మార్కెట్ విలువ ప్రకారం ఒక్కో ఎకరాకు రూ. 95లక్షలు చెల్లించాలని అందులో పేర్కొన్నారు. ఆ తర్వాత స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో పాటు అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఇంత వరకు బాగానే ఉన్నా తదుపరి కార్యాచరణ మాత్రం ముందుకు సాగడంలేదు. స్టేడియం నిర్మాణం కోసం భూకేటాయింపులు జరిగి 8 నెలలు దాటినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

రాయగిరిలో స్టేడియం నిర్మాణానికి కేటాయించిన స్థలం

ఇంకా స్టేడియమే మంజూరు కాలే..

భూ కేటాయింపులు జరిగినా.. స్టేడియం నిర్మాణానికి ఇప్పటి వరకు అసలు ఎలాంటి మంజూరు ఉత్తర్వులు జారీ చేయలేదు. ఖేలో ఇండియా కింద నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. అయితే విడుతల వారీగా స్టేడియాలను నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు. మొదటి విడుతగా రూ. 33.5 కోట్లు అవసరం పడనున్నాయి. డీపీఆర్ తయారీ కోసం హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేసి.. ఉన్నతాధికారులు పంపించారు. ప్రభుత్వం సైతం ఖేలో ఇండియా కింద నిధులు ఇవ్వాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. కానీ ఇప్పటి వరకు దీనికి సంబంధించి ఎలాంటి కదలిక లేదు. కేంద్ర నిధులు వస్తేనే స్టేడియం మంజూరు, ఇతర పనులు ముందుకు సాగనున్నాయి. రాష్ట్ర సర్కారు సైతం నిధులు తెప్పించడంలో చొరవ చూపించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్టేడియం ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి

రాయగిరిలో స్టేడియం ఏర్పాటుకు ప్రభుత్వం 10 ఎకరాలు కేటాయించింది. కానీ ఇప్పటివరకు ఏర్పాటుకు మంజూరు ఉత్తర్వులే విడుదల చేయలేదు. ఇక్కడ స్టేడియం ఏర్పాటైతే ఎంతోమంది క్రీడాకారులకు ప్రయోజనం చేకూరుతుంది. వీలైనంత త్వరగా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– రచ్చ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ భువనగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి


ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే

మట్టిలో మాణిక్యాలను తయారు చేసే శక్తి గురువులదే..

- టీచర్లు విద్యార్థులకు ఆదర్శంగా నిలువాలి
- ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రభుత్వ విప్ బీర్ల, ఎమ్మెల్యే కుంభం
- 25 మంది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేత

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 5 : మట్టిలో మాణిక్యాలను తయారు చేసే శక్తి గురువుకు మాత్రమే ఉందని, సమాజంలో గురువుది ప్రత్యేక పాత్రని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా బీర్ల, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కలెక్టర్ హనుమంత్ కె.జెండగే హాజరయ్యారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా 25 మంది జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి సన్మానించారు. అనంతరం బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత గురువే ముఖ్యమని, వారికి అంత స్థానం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నదని, జిల్లాలో రూ.23.80 కోట్లతో 588 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని, ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దాలని సూచించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దేది గురువులేన్నారు. విద్యార్థుల విజయంలో వారి పాత్ర ఎంతో ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు వారు కోరిన విధంగా బదిలీలు, పదోన్నతులు కల్పించిందని చెప్పారు. కలెక్టర్ జెండగే మాట్లాడుతూ విద్యారంగానికి కృషి చేసున్న ఉపాధ్యాయులను ప్రోత్సహించేలా ఉత్తమ గురువులను సన్మానించుకుంటున్నామన్నారు. గురువులు విద్యార్థులకు రోల్ మోడల్‌గా ఉండాలని తెలిపారు. పదో తరగతిలో గత సంవత్సరం సాధించిన 91 శాతాన్ని ఈ సంవత్సరం అధిగమించాలని చెప్పారు. ఆ తర్వాత జిల్లా విద్యాశాఖ అధికారి కానుగ నర్సింహ జిల్లాలో విద్యా రంగంలో జరుగుతున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్హాలోమ్, జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, మున్సిపల్ చైర్మన్ పోతం శెట్టి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


తుర్కపల్లి మండలంలోని మల్కాపురంలో పారుతున్న కాళేశ్వరం జలాలు

గలగలా కాళేశ్వర గంగ

- మూడోసారి జిల్లాకు గోదావరి జలాలు విడుదల
- కొండపోచమ్మ సాగర్ నుంచి 25 రోజులుగా రాక
- తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాల్లో 31 చెరువుల్లోకి నీరు
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

తుర్కపల్లి, సెప్టెంబర్5 : కాళేశ్వరం జలాలు జిల్లాకు మూడో సారి వస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రెండు సార్లు విడుదల చేయగా ఇప్పుడు మూడో దఫా వస్తున్నాయి. కాల్వల ద్వారా తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాల్లోని చెరువులు నింపుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు జిల్లాలో ఆశించినంత లేకపోవడంతో ఈ కాళేశ్వరం జలాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

నిండుతున్న చెరువులు..

కొండపోచమ్మసాగర్ నుంచి నీటి విడుదలతో తుర్కపల్లి మండలంలోని గోపాల్‌పురం గ్రామంలో కొండపోచమ్మ చెరువు, నాగాయపల్లి చెరువు, చిన్నలక్ష్మాపురంలోని దాపల్‌చెరువు, మాదాపురం జగ్గయ్యచెరువు, కొత్త చెరువు, గోపాల్‌పురంలోని పొట్టొనికుంట చెరువులు నిండి అలుగులు పోస్తున్నాయి. బొమ్మలరామారం మండలంలోని చీకటిమామిడిలో రామసానికుంట చౌటకుంట, నల్లచెరువు, ఎర్రకుంట, తిమ్మాపురంలోని గూడెంచెరువు, తిమ్మప్ప చెరువు, ప్యారారంలోని మల్లన్న చెరువు, సోలిపేటలోని ఊరచెరువులోకి కాళేశ్వరం జలాలు వచ్చి వచ్చి చేరుతున్నాయి. ఎం.తుర్కపల్లి ప్రధాన కాల్వ ద్వారా తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి కొత్తకుంట, పంతెకుంట చెరువు, మైసమ్మ కుంట, బండదరాణి కుంట, చాపల కుంట, తుర్కపల్లిలోని బహదూర్‌మియా చెరువు, వెంకటపురంలోని సూదిలేని చెరువు, తోక చెరువు, మల్కపురంలోని లిప్పకుంట, రావులవాణికుంట చెరువులోకి నీరు వచ్చి చేరగా, ముల్కలపల్లిలోని చౌదరి చెరువు, ధర్మారంలోని విఠల్‌చెరువు, గోవిందచెరువు, గొల్లగూడెం కాపల్‌చెరువు, కొత్త చెరువు, పటేల్‌చెరువు, పల్లెపహాడ్‌లోని సోమయ్యచెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. బొమ్మలరామారం మండలంలోని మల్లారెడ్డి చెరువు కాళేశ్వరం జలాలతో నిండాయి. మరి కొన్ని రోజుల్లో వందశాతం నింపేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

2020 నుంచే

జిల్లాకు సాగు జలాలు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు సఫలీకృతమయ్యాయి. గతంలో 2020లో స్థానిక మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, తుర్కపల్లి ప్రధానకాల్వకు కొండపోచమ్మసాగర్ జలాలను విడుదల చేయించారు. 2023లో ఎం తుర్కపల్లి కాల్వకు సైతం నీటిని విడుదల చేశారు. నాటి నుంచి పలు రకాలుగా జిల్లాలోని 2 మండలాలకు కాళేశ్వరం జలాలు వచ్చి చేరుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నా ఆశించినంత ఫలితం లేకుండా పోయింది. వ్యవసాయానికి నీళ్లు అందే పరిస్థితి లేదు. రెండు మండలాల వ్యాప్తంగా చాలా చోట్ల వరిపంట ఎండిపోయే దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గత నెల 7న ఇరిగేషన్ అధికారులు కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని విడుదల చేశారు.

ఆగష్టు 7 నుంచి నీటి విడుదల

గత నెల ఆగస్టు 7న సిద్దిపేట జిల్లా దామరకుంట వద్ద కొండపోచమ్మ సాగర్ నుంచి తుర్కపల్లి(ఎం) కాల్వల్లో 1.50 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తుర్కపల్లి ప్రధాన కాల్వ ద్వారా తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాల్లోని 12 చెరువులు నింపగా 1,496.24 ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతున్నది. ఎం.తుర్కపల్లి ప్రధాన కాల్వ ద్వారా తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాల్లోని 19 చెరువులు నింపగా 1496.24ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు చేరుతున్నది.

తుర్కపల్లి మండలంలోని గోపాల్‌పురంలో తరలివస్తున్న కాళేశ్వరం జలాలు

కాళేశ్వరంతో నీళ్ల సమస్య తీరింది

మాజీ సీఎం కేసీఆర్ రైతుల బాధ తెలిసినోడు. రైతులకు నీళ్ల సమస్య రావొద్దని పసిగట్టిండు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టును కట్టిండు. ఇచ్చిన మాట ప్రకారం గోదావరి జలాలు విడుదల చేసిండు. మా మండలానికి ఈసారితో మూడు దఫాలుగా కాళేశ్వరం జలాలు వచ్చినయ్. అది కేసీఆర్ పుణ్యమే.

– నారం పెద్దులు, రైతు, గోపాలపురం, తుర్కపల్లి మండలం

వరద బాధితులకు తక్షణ సాయమేది?

- ఇద్దరు మృతుల కుటుంబాలకు చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకొన్న అధికారులు
- కనీసం నిత్యావసర సరుకులకూ నోచుకోని వందలాది బాధిత కుటుంబాలు
- మంత్రి, ఎమ్మెల్యేలు వట్టి చేతులతోనే పరామర్శలు

సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించి ఆరు రోజులవుతున్నా పత్తాలేదు

సూర్యాపేట, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదై భీకరంగా ప్రవహించిన వరదలతో అతలాకుతలమై సర్వం కోల్పోయిన బాధితులకు స్వయానా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన సాయం అందలేదు. బాధితులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, తక్షణ సాయం కోసం కలెక్టర్ బ్యాంకు ఖాతాకు రూ.5 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ ఇద్దరు మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున అందించారు తప్ప ఇతర బాధితులకు అందింది శూన్యం. తక్షణ సాయం అంటే గంటల్లో అందిస్తారు.. కానీ ఆరు రోజులైనా అందదా అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లోని వందల ఇండ్లలోకి నీళ్లు చేరి నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులన్నీ తడిసి ముద్దయ్యాయి. వేలాది ఎకరాల్లో పత్తి, వరి ఇతర పంటలు నేలపాలు కాగా వందలాది ఎకరాల పొలాల్లో ఇసుక, మట్టి మేటలు పేరుకుపోయాయి. ఇది జరిగి ఆరు రోజులు గడుస్తుండగా సర్వం కోల్పోయి ఆకలితో అలమటిస్తున్న వరద బాధితులను ఎవరు పరామర్శించేందుకు వచ్చినా తమకు కనీసం తాగునీరు, భోజనాలు అందించాలని కోరుతున్నారు. అయినా స్పందించిన నాథుడే కరువయ్యారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి వట్టి చేతులతో పర్యటించారు తప్ప ఎలాంటి సాయం చేయలేదు. గత నెల 31న కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలతోపాటు తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని మద్దిరాల, అర్వపల్లి తదితర మండలాల్లో 25 నుంచి 35 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైన విషయం తెలిసిందే.

భోజనాలు సమకూర్చిన బంధువులు, స్థానికులు

సూర్యాపేట జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో వరదల కారణంగా దాదాపు 3వేలకు పైనే ఇండ్లలోకి మూడు ఫీట్ల నుంచి ఆరు ఫీట్ల వరకు నీరు చేరి వస్తువులన్నీ తడిసి ముద్దయ్యాయి. దీంతో ఆయా ఇండ్లల్లో నివాసం ఉంటున్న వారి పరిస్థితి అంధకారంగా, అగమ్యగోచరంగా మారింది. ఇంటిని చూస్తుంటే దుఃఖం వస్తుందని, ఆకలైతే దిక్కులు చూసే పరిస్థితి దాపురించిందని పలువురు బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వ పరంగా ఏదో ఒకటి అందుతుందని అనుకున్నామని, ఐదు రోజులు గడిచినా ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి పోతున్నారు తప్ప పట్టించుకోవడం లేదని అంటున్నారు. బంధువులు, స్థానికులే బాధితులకు ఆహారం అందిస్తున్నారు.

ఇంకా బాధితులను గుర్తిస్తున్న అధికారులు

వరద బాధితులకు వెంటనే రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించగా ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. వరదల్లో చనిపోయిన రెండు కుటుంబాలకు చెక్కులు ఇచ్చారు. కానీ పశువులు, మేకలు చనిపోయిన కుటుంబాలతో పాటు పూర్తిగా ఇండ్లు కూలిన వారికి, పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లకు, వరదల్లో ఇండ్లలోకి నీరు చేరి సర్వం కోల్పోయిన వారికి సాయం అందలేదు. ఆరు రోజులవుతున్నా సాయం లేకపోగా ప్రస్తుతం బాధితులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. ఈ విషయమై కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణను వివరణ కోరగా బాధితులను గుర్తించేందుకు సర్వే పూర్తి కావచ్చిందని, నేడో రేపో బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తామని చెప్పారు.


నూతనకల్ మండలం గుండ్ల సింగారం కత్వా కింద పొలాల్లోకి చేరిన ఇసుక మేట

వరద తాకిడికి కోతకు గురైన గుండ్లసింగారం బ్రిడ్జి

ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయం వద్ద..

రుణమాఫీకి సర్వర్ సమస్యలు

- రైతుల వివరాల అప్‌లోడ్‌లో జాప్యం

నేరేడుచర్ల, సెప్టెంబర్ 5 : రుణ మాఫీ అందని రైతుల వివరాలను సేకరించి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వ్యవసాయ అధికారులు అప్‌లోడ్ చేస్తున్నారు. కానీ సర్వర్ సమస్యతో కుటుంబ నిర్ధారణ, తదితర వాటి నమోదులో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ఈ సమస్యతో గురువారం నేరేడుచర్ల వ్యవసాయ కార్యాలయం ఎదుట రైతులు నిరీక్షిస్తూ కనిపించారు. మొదట యాప్‌లో రుణమాఫీ డేటా పొంది అనంతరం దరఖాస్తు పారం పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో కొంత సేపు యాప్ పని చేయకపోవడం, మరి కొంత సేపు ఆన్‌లైన్ సేవలు లేకపోవడంతో ఆలస్యమవుతున్నది. దాంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నేరేడుచర్ల వ్యవసాయ కార్యాలయం ఎదుట బారులుతీరిన రైతులు

డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలివ్వాలి

- తాసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల ధర్నా

శాలిగౌరారం, సెప్టెంబర్ 5 : మండలంలోని తక్కెళ్లపహాడ్‌లో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలు అందించాలని కోరుతూ లబ్ధిదారులు గురువారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ తక్కెళ్లపహాడ్ గ్రామంలో గత ప్రభుత్వం 28 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించిందన్నారు. గతేడాది అప్పటి తాసీల్దార్ పాల్‌సింగ్ గ్రామంలో ఇండ్లు లేని నిరుపేదల నుంచి దరఖాస్తులు స్వీకరించి, గ్రామ సభలో డ్రా పద్ధతిన 28మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ఇండ్ల పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు కావస్తున్నా నేటికీ లబ్ధిదారులకు పట్టాలు అందించలేదన్నారు. తామంతా ఇండ్లు లేక వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే ఇండ్ల పట్టాలను అందించాలని కోరారు. అనంతరం తాసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.


శాలిగౌరారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

జల పరవళ్లు గుండ్ల సింగారం

ఇటీవల కురిసిన వర్షాలకు నూతనకల్ మండలంలోని గుండ్ల సింగారం కత్వా అలుగుపోస్తూ చూపరులను కట్టిపడేస్తున్నది. జాలువారుతున్న జలాలు ఆహ్లాద అనుభూతినిస్తున్నాయి.

– సూర్యాపేట నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్